# నేరము శిక్ష

**చీకటి గదిలో బంధించబడి ఉంది రెండు పదులు నిండని జవ్వని. ఆమె కాళ్ళు, చేతులు తాడుతో కట్టివేయబడి ఉన్నాయి.**

**పళ్ళ బిగువున శక్తినంతా కూడ దీసుకొని కట్లు తెంచుకోడానికి విఫలయత్నం చేస్తోంది. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. ఎవరైనా వచ్చి కాపాడతారని వేయి కళ్ళతో ఎదురు చూస్తోంది.**

## జిగోలో

- ఆదిత్య

ఎవరో ఆమె మొర ఆలకించినట్లు, పక్కనున్న చెక్క తలుపు విరిగిపడింది. ఆ వెంటనే జివ్వున వీచే సుడిగాలిలో కండలు తిరిగిన పాతికేళ్ళ కుర్రాడు ఆ గదిలోకి ప్రవేశించాడు. అతన్ని చూస్తూనే ఆమె కళ్ళు మిలమిల మెరిసాయి. క్షణం ఆలస్యం చేయకుండా కట్లు విప్పదీసాడు.

''ఓ నా రక్షకుడా...'' అంటూ అతని గుండెల మీద ఒదిగిపోయింది. ఆమెను మరింతగా ఒడిసి పట్టుకుని ''రోజా తోడుంటే చాలు లోకాన్నే జయిస్తా...'' ధృడంగా పలికాడు. ఇంతలో ఎవరో ఇద్దరు ధృడకాయులు వాళ్ళిద్దరినీ విడదీయాలని బలంగా లాగసాగారు. ఒకే ఒక్క ముష్టిఘాతంతో ఇద్దరిని మట్టి కరిపించాడా యువకుడు.

కండలు తిరిగిన అతని కైదండుని బలంగా హత్తుకుంటూ ''రోజాలో ఇంత శక్తి దాగుందా..?'' ఆశ్చర్యంగా అడిగిందా యువతి. ''రోజా అండర్ గార్మెంట్ వేసుకుంటే మనకు తిరుగే లేదు. నీకు రోజా శక్తి చూపిస్తా...'' అంటూ కన్నెపిల్లని రెండు చేతుల్తో ఎత్తుకున్నాడు.

ఇంతలో ''కట్..'' అన్న డైరెక్టర్ కేకతో కెమేరా ఆగింది.

లైట్లు వెలిగాయి. సిక్స్ పాక్ మజిల్ బాడీ ఉన్న యువకుడు దినేష్ పక్కనున్న చెయిర్‌లో రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు.

అంత వరకు తన తడితడి అందాలను కెమేరా ముందు ఆరబోసిన తార నిండుగా ఓ గౌన్ వేసుకొని ఇంకో చెయిర్‌లో కూర్చుంది.

ఇంతలో దినేష్ సెల్ మోగింది. నెంబర్ చూస్తూనే మొహం వెలిగిపోయింది. సెల్ ఆన్ చేస్తూ–

''హాయ్ గరిమ... ఇదిగో అయిపోవచ్చింది. ఇప్పుడే డైరెక్టర్ ప్యాక్ అప్ చెప్పారు...'' అతని మాట పూర్తి కాకుండానే ''నీతో యాక్ట్ చేస్తుందెవరు...?'' అడిగింది గరిమ.

''అబ్బా నీ ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. ఈ ఫీల్డులో అందరితో కలిసిపోవాలి... అవును ఎక్కడున్నావు...?''

చెప్పింది గరిమ.

పది నిమిషాల్లో దినేష్ బైక్ 'సిల్వర్ బౌ' రెస్టారెంట్ ముందు ఆగింది. గరిమ టేబుల్ దగ్గరకు చేరాడు. ''సారీ....గరిమ...లేటయినందుకు...సారీ..'' అతని మాట పూర్తి కాక ముందే–

''ఏవిటా సరిగమా..సరిగమా..సంగీత సాధనలా... అయిన ఆలస్యం ఎలాగు అయింది గాని నే చెప్పేది జాగ్రత్తగా విను. నీకు ఎలాగూ మా నాన్న ముందు నిలబడి మన పెళ్ళి గురించి అడిగే ధైర్యం లేదు... కండలు మాత్రం పెంచావు...''

''ఏయ్ గరిమా దిస్ ఈజ్ టూ మచ్. నన్నేదైనా అనదల్చుకుంటే అను, కానీ, నా కండల్ని ఏం అనకు... ఇవే కనుక లేకుంటే నీ దృష్టిలో పడి వుండే వాణ్ణి కాను..'' అంటూ షర్ట్ చేతుల్ని పైకి లాక్కున్నాడు దినేష్.

''ఈ రోజు మా డాడీకి మన సంగతి చెప్పేస్తా. అది విన్న మా నాన్న నీ దగ్గరకు రావచ్చు. ఇలా బోరవిరుచుకుని కాకుండా కొంచెం నీటుగా, జెంటిల్‌మెన్‌లా కనిపించు...''

''ఓ.కే... నీ ఆజ్ఞ...''అంటూ బుద్ధిమంతుడిలా తలూపాడు దినేష్.

★★★

తన గదిలో ఆఫీస్ ఫైళ్ళు చూసుకుంటున్నాడు

ప్రముఖ బిజినెస్ మాగ్నట్ రిషబ్ శుక్లా.

''డాడీ..'' అన్న పిలుపు వింటూనే తలెత్తి చూసాడు శుక్లా. ఎదురుగా తన గారాలపట్టి గరిమను చూస్తూనే ''ఇటు దగ్గరగా రారా...'' అంటూ ఆప్యాయంగా పిలిచాడు.

తండ్రి పక్కన చేరి మరోసారి గారాబంగా ''డాడీ...'' అంటూ దీర్ఘం తీసింది.

''చెప్పరా! ఏదో చెప్పాలనుకుంటున్నావనుకొంటా...''

''నేనో అబ్బాయిని...'' గరిమ మాట పూర్తి కాకుండానే–

''ఓ... లవ్ అఫైరా...చెప్పు...చెప్పు... కుర్రాడేం చేస్తున్నాడు... డాక్టరా, ఇంజనీరా, ఐటి ప్రొఫెషనలా లేక బిజినెస్ మెన్నా...? ''

ఇవేమీ కాదన్నట్లుగా అడ్డంగా తలూపింది గరిమ.

''మరేం చేస్తాడు...?''

''యాడ్ ఫిలింస్‌లో యాక్ట్ చేస్తాడు. పేరు... దినేష్, అందరూ డినో అంటారు...''

''ఏమిటీ...యాడ్ ఫిలింలో యాక్ట్ చేస్తాడా...? ఆ మాటనడానికి సిగ్గుగా లేదు... ఆ చవకబారు మనుషులే దొరికారా నీకు. రేపు నా పరువేం కావాలి? మన స్టేటస్ ఏంటో ఆలోచించావా...?''

''యాడ్ ఫిలింలో యాక్ట్ చేస్తే తప్పేమిటి డాడీ, ఒకప్పుడు యాడ్ ఫిలింలోనూ, టి.వి. ఫిలింలోనూ నటించిన వాళ్ళే ఈనాడు సూపర్‌స్టార్స్‌గా వెలుగొందుతున్నారు..'' అంటూ దినేష్‌ను సమర్థించింది గరిమ.

''వాణ్ణి సమర్థిస్తావే కాని నా మాట వినవా...?''

''ప్లీజ్....డాడీ...దయచేసి నా మాట వినండి, ఒక్కసారి దినేష్‌ని చూడండి. ఆ తరువాత నిర్ణయం తీసుకోండి...'' అర్థిస్తున్నట్లుగా అడిగింది గరిమ.

కూతురు కళ్ళల్లో సన్నటి కన్నీటి పొరను చూడగానే తండ్రి మనసు చలించింది.

''సరే, నువ్వు చెబుతున్నావు గనుక దినేష్‌ను ఓసారి కలుస్తాను. కాని ఇప్పుడు కాదు ఆఫీస్ పని మీద బెంగుళూర్ వెళ్తున్నాను. వారం రోజుల తర్వాత తిరిగొస్తాను, అప్పుడు కలుస్తాను...'' అంటూ దినేష్ అడ్రస్ తీసుకున్నాడు రిషభ్ శుక్లా.

★★★

వడి వడిగా అడుగు లేస్తూ దినేష్ రూమ్‌కు చేరుకుంది గరిమ. రూమ్‌లో దినేష్ లేడు కాని రూమ్‌మేట్ మాధవ్ ఉన్నాడు.

దినేష్ గురించి అడిగితే ఓ వెర్రి నవ్వు నవ్వాడు మాధవ్.

''ఎక్కడికెళ్ళాడో నీకు చెప్పలేదా..?''

''నాకైతే చెప్పలేదు గాని ఈ రాత్రి వేళ ఎక్కడికెళ్ళి ఉంటాడో నాకు తెలుసు...'' అన్నాడు మాధవ్ ఉరఫ్ మాడి.

''తెలిస్తే చెప్పొచ్చుగా...''

''అదే నీకు చెప్పాలా వద్దా అని ఆలోచిస్తున్నాను'' అలా మాట్లాడుతూనే ట్రిమ్‌గా తయారయ్యాడు మాధవ్. కాసేపట్లో రూమ్ ముందు ఖరీదయిన కారు ఆగింది. కారులోనుండి హైక్లాస్ సొసైటీకి చెందిన ఓ అందమైన స్త్రీ ''హాయ్... మాడి..'' అంటూ అతన్ని చేరింది.

పక్కన మూడో మనిషి ఉన్నారన్న ధ్యాస కూడా లేకుండా మాధవ్‌ను కౌగిలించుకొని, ముద్దులు పెట్టుకొని''లుకింగ్ స్మార్ట్.. ఇవాళ్ళ క్లబ్‌లో వాళ్ళంతా మనను చూసి కుళ్ళు కోవాలి... తెలుసా.. కమాన్... అంటూ మాధవ్ చెయ్యి పట్టుకుని లాక్కుపోయింది. మాధవ్ వెళ్తూ వెళ్తూ ''గరిమా! డినో ఈ రాత్రి రాడు. నువ్వొచ్చావని నే చెబుతాగాని నువ్వెళ్ళి పో...'' అన్నాడు.


గరిమకు ఏం చేయాలో తోచలేదు. అక్కడ కాసేపు కూర్చుంది. టేబుల్ పై ఉన్న పుస్తకాలు చూస్తుంటే అక్కడ డినో డైరీ కనిపించింది. అందులో తన గురించి ఏం రాసుంటాడో చూడాలన్న చిలిపి కోరికతో డైరీ పేజీలు తిప్పింది.

అందులో పేజీలన్నీ ఖాళీగా ఉన్నాయి. కొన్ని పేజీల్లో మాత్రం కొంత మంది ఆడవాళ్ళ పేర్లు, ఫోన్ నంబర్లు ఉన్నాయి. అవన్నీ కూడా సిటీలో బాగా డబ్బున్న స్త్రీల పేర్లు. వాళ్ళతో డినోకు ఏం పనో గరిమకు అర్థం కాలేదు.

డైరీలో ఓ మూల 'డినో...జిగోలో' అన్న వాక్యం కనిపించింది. జిగోలో అంటే ఏమిటో అర్థం కాలేదు ఆమెకు.

★★★

''ఏయ్... డినో...అప్పుడే వెళ్ళిపోతావా...



ఈ రాత్రంతా ఉండిపోరాదు...'' దినేష్‌ను తన కౌగిలిలో కదలకుండా బంధిస్తూ అంది మిసెస్ మాధుర్.

''లేదు నేను వెళ్ళిపోవాలి... ఇంక ఇదే ఆఖరు, మళ్ళీ ఇక్కడకు రాను'' కౌగిలి విడిపించుకుంటూ అన్నాడు డినో.

''ఏ ఎందుకు రావు మేమిచ్చే డబ్బు సరి పోవట్లేదా?''

''అదేం కాదు ఇంక నేను జీవితంలో స్థిర పడదాం అనుకుంటున్నా...''

''అంటే ఈ కండలు తిరిగిన గండరగండడు ఒక్కరికే సొంతమవుతాడన్నమాట... ఇంతకు ఎవరా చిన్నది..'' మిసెస్ మాధుర్ మాటల్లో ఈర్ష్య ధ్వనించింది.

''గరిమా శుక్లా....అని ఫైన్ ఆర్ట్స్ కాలేజ్ స్టూడెంట్..'' డ్రెస్ సరిచేసుకుంటూ చెప్పాడు డినో.

''ఇది నా ప్రయివేటు విషయం అందరికీ చెప్పాల్సిన అవసరం లేదంటూ'' అక్కడి నుండి నిష్క్రమించాడు డినో.

★★★

రిషబ్ శుక్లా పోలీస్ కస్టడీలో ఎస్.ఐ. ముకుల్ ముందు కూర్చుని ఉన్నాడు.

''నిజంగా నాకు ఈ హత్యకు ఎలాంటి సంబంధం లేదు. మా అమ్మాయి గరిమ కోరిక మేరకు దినేష్‌ను కలవడానికెళ్ళాను... అంతే''

''ఆ విషయం మాక్కూడా తెలుసు. మీ అమ్మాయి పెళ్ళి విషయంలో మీ ఇద్దరి మధ్య వాగ్యుద్ధం జరిగింది. గరిమను వదిలేస్తే అతను అడిగినంత డబ్బు ఇవ్వాలని మీ బ్రీఫ్ కేసులో పది లక్షల క్యాష్ కూడా ఉంచుకున్నారు. దినేష్ లొంగలేదని అతన్ని షూట్ చేశారు..'' ఏకధాటిగా ఎస్.ఐ. చెబుతుంటే నోరు మెదపకుండా ఉండి పోయాడు శుక్లా. అక్కడ దొరికిన బుల్లెట్ కూడా శుక్లా రివాల్వర్‌దే.

★★★

యూనివర్సల్ జిమ్‌లో డంబుల్స్‌తో ఎక్సర్ సైజ్ చేస్తున్నాడు మాధవ్. వళ్ళంతా చెమటతో తడిసిపోయింది. అయినా ఏ మాత్రం అలసట లేకుండా నిలువెత్తు అద్దం ముందు నిల్చొని తన కండరాల పొంగుని చూసి మురిసిపోతున్నాడు. తన కండరాల బిగిని చూస్తుంటే అతనికి గర్వంగా కూడా వుంది.

అలా ఆలోచిస్తూ రిలాక్స్‌డ్‌గా బెంచీపై వెల్ల కిలా పడుకున్నాడు. ఈ రోజు రాత్రి మినిస్టర్ భార్య లీనా ఘోష్‌తో అపాయింట్‌మెంట్ ఉంది మాధవ్‌కు.

అప్పుడే అతని సెల్ మోగింది. అలా పడు కుని వుండే సెల్ ఆన్ చేసి ''హలో..'' అన్నాడు.

ఫోన్‌లో స్త్రీ స్వరం వినిపించగానే హుషా రుగా ''మీరెవరూ...మిమ్మల్నెక్కడ కలవమంటా రు..'' అడిగాడు మాధవ్.

''నేనెవరో తెలుసుకొనేలోగా నువ్వీలోకంలో ఉండవు రా...బ్లడీ జిగోలో...''

''ఏయ్.. ఏమిటి నువ్వు మాట్లాడుతోంది'' సరిగ్గా అప్పుడే సీలింగ్‌కు వేలాడుతున్న వెయిట్ పుల్లీ ఫట్‌మని తెగి మాధవ్ తలపై పడటంతో ఫటేల్లుమని తల బద్దలవడంతో కనీసం కెవ్వు మన్న కేక కూడా వెలువడకుండా మాధవ్ ప్రాణాలు వదిలాడు.

★★★

ఎస్. ఐ.ముకుల్ మాధవ్ శవాన్ని నిశితంగా పరిశీలించాడు. ఎంతో పకడ్బందీగా కట్టిన వెయిట్ పుల్లీ తెగడం ఆశ్చర్యంగా వుంది. అది కూడా ఎవరో షూట్ చెయ్యడం వల్ల పుల్లీ తెగి పడింది. అక్కడ దొరికిన బుల్లెట్‌ను సేకరించి పరీక్షకు పంపించాడు.

ఆ బుల్లెట్ కూడా రిషబ్ శుక్లా రివాల్వర్ నుండి వెలువడిందే. మాధవ్ సెల్‌ఫోన్ కాల్ రిజిష్టర్ చెక్ చేసి లాస్ట్ కాల్ నంబర్ నోట్ చేసుకున్నాడు.

అయితే దాని వల్ల ఎలాంటి క్లూ లభించ లేదు. ఆ కాల్ ఓ పబ్లిక్ ఫోన్ నుండి వచ్చింది. ముకుల్ అలా ఆలోచనలో వుండగా అతని ఫోన్ మోగింది. అది రిసీవ్ చేసుకున్న ఎస్. ఐ. మొహం సీరీయస్‌గా మారింది. ''ఓ.కే.మేం వచ్చేస్తున్నాం, బి కేర్ ఫుల్'' అంటూ జీపు తీసు కొని బయలుదేరాడు.

★★★

వినోద్ తన బైక్ ఓ పక్కగా పార్క్ చేసి ఆ బిల్డింగ్‌లో ప్రవేశించి ''మేడమ్...మేడమ్...'' అంటూ పిలిచాడు. ''ఇటు బెడ్ రూమ్ వైపు'' అన్న తియ్యని పిలుపు వింటూనే వడివడిగా బెడ్ రూమ్‌లో అడుగుపెట్టాడు.

అందులో అడుగుపెట్టిన వినోద్ అక్కడి దృశ్యం చూస్తునే నోట మాట రాలేదు.

అతనికి ఎదురుగా ఓ అమ్మాయి రివాల్వర్ గురి పెట్టి ఉంది. కొన్ని క్షణాలయితే ఆమె చేతిలో తుపాకి పేలి వుండేది. కాని ఎస్.ఐ. ముకుల్ అక్కడ ప్రత్యక్షమవటంతో ఆమె పారిపో జూసింది.

''యూ ఆర్ అండర్ అరెస్ట్ మిస్ గరిమా...'' ముకుల్ అనే సరికి విస్తుపోయి నిల్చుంది గరిమ.

''ప్రాణాధికంగా ప్రేమించిన నీ ప్రియుడు దినేష్ నిజరూపం అతనో జిగోలో అని తెలియ గానే నువ్వు సహించలేక పోయావు. అందుకే మీ డాడీ రివాల్వర్‌తో అతన్ని కాల్చేసావు. ఆ విషయం తెలియని శుక్లా ఆ సమయానికి అక్కడ ఉండడం వల్ల మేము అతన్ని అరెస్ట్ చేశాం, అతడే హంతకుడనుకున్నాం. కాని దినేష్ రూమ్మేట్స్ మాధవ్, వినోద్‌లను కూడా చంపబూనావు. అందుకే నీ మీద అనుమానం వచ్చింది. ఈ ఉద యమే వినోద్ ఫోన్ చేసి తన ప్రాణానికి ముప్పు వాటిల్లనుందని చెప్పడంతో మేం అతన్ని ఫాలో అయ్యాము..''అన్నాడు ముకుల్.

''నిజమే ఎస్.ఐ.గారు ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన దినేష్‌ను నా చేతుల్తో నేనే మట్టు బెట్టా. కారణం వాడో జిగోలో,సమాజానికి చీడ పురుగు. వాడే కాదు వాడి రూమ్‌లో ఉండే ముగ్గురు కూడా మగ వ్యభిచారులు. అందుకే వాళ్ళను అంతం చేద్దామనుకున్నా...''

''సారీ... గరిమా నేరస్థులను శిక్షించడానికి చట్టం ఒకటుంది. చట్టాన్ని నీ చేతుల్లోకి తీసుకో కూడదు..''

దోషిలా తలొంచుకుంది గరిమ. కేసు విచార ణలో వుంది.

★

